# చిన్నగీత – పెద్దగీత –

ఇలపావులూరి మురళీ మోహనరావు



ఆ రోజు ఆదివారం కావడంతో లాయర్ భారతీదేవి ఇంట్లోనే ఉన్న తన ఆఫీసుగదిలో కూర్చుని ముఖ్యమైన కేసుకు సంబంధించిన కాగితాలను చూస్తున్నది. సిబ్బంది ఎవరూ లేరు.

స్త్రీల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పురుషుల అన్యాయాలకు బలైపోయిన అనేకమంది దిక్కులేని మహిళల తరపున న్యాయపోరాటం చేసిందామె. ఆమె వాదనలన్నీ న్యాయ బద్ధంగా, నీతి నిజాయితీలతో కూడి ఉండటంతో సాటి న్యాయవాదులకే కాక న్యాయమూర్తులకు కూడా ఆమె పట్ల గౌరవాభిమానాలుండేవి. అబలల కోసం ఆమె చేసే న్యాయ పోరాటానికి అడ్డంకులు ఉండకూడదని వివాహాన్ని కూడా త్యాగం చేసిందని చెప్పుకుంటారు.

భారతి ఏకాగ్రతకు భంగం కలిగిస్తూ ఓ యువతి బలవంతాన తలుపు తోసుకుని గదిలోకి ప్రవేశించింది.

తలెత్తి చూసింది భారతి.

ఆ యువతికి పాతిక సంవత్సరాల లోపు వయసుంటుంది. అందంగా ఉంది. కానీ ఆ ముఖంలో భయం, ఆందోళన, వ్యాకులత ముప్పేటగా ఉన్నాయి. కురులు చెదిరి ఉన్నాయి. చేతిలో సూట్‌కేస్ ఉన్నది.

"నమస్కారమండీ. నా పేరు రజని. ఈ ఊరే మాది" అన్నది కంపిస్తున్న స్వరంతో.

"కూర్చోమ్మా.... ఏం పని మీద వచ్చావు?"

"మీ సాయం కోరి వచ్చాను. మీ గురించి చాలా కాలంగా వింటున్నాను. అందరూ ఉన్న అనాథను. మీరు తప్ప శరణు లేదు."

"నేనేం చెయ్యగలను?"

"నాకు విడాకులిప్పించండి. ప్లీజ్...."

"వ్వాట్?"

"అవును. నాకు అర్జెంటుగా విడాకులు కావాలి. నేనా నరకం నుంచి బయట పడాలి. నేనీలోకంలో బ్రతకాలనుకుంటున్నాను. దయచేసి నన్ను రక్షించండి" వణుకుతూ అన్నది రజని.

సకల పాపాలనూ తనలో ఇముడ్చుకుంటూ స్వచ్ఛంగా ప్రవహించే గంగా నదిలా అపారానుభవాన్ని నింపుకున్న హృదయంతో నిండుగా నవ్వింది భారతి.

"నవ్వుతున్నారా మేడమ్! నేను మీకు పెద్ద ఎత్తున ఫీజు ఇచ్చుకోలేను. కోర్టు ఖర్చులు, వ్యవహారాలు కూడా నాకు తెలియవు. నా మెడలో నాలుగు తులాల మంగళ సూత్రం ఉంది. దాన్ని మీకిస్తాను. దయచేసి నాకు విడాకులిప్పించండి" నమస్కరిస్తూ అన్నది రజని.

"నా నవ్వుకు అర్థం గ్రహించే వయసు నీకింకా రాలేదమ్మా. విడాకులంటే సూపర్ మార్కెట్లో దొరికే వస్తువు కాదు. నీ భర్త ఎవరు? మీకు పెళ్ళై ఎన్నాళ్ళైంది? నీ తల్లిదండ్రులెవరు? మీ వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేసుకోవాలని ఎందుకనుకుంటున్నావు?"

"మేడమ్.... నా భర్త ఒక గవర్నమెంటు ఉద్యోగి. పెళ్ళై మూడు సంవత్సరాలైంది. రెండు సంవత్సరాల బాబున్నాడు. నా తల్లిదండ్రులు

పుట్టింట నా కష్టాలు చూసి అయినవాళ్ళకు పుట్టింటోల్లో చేరి కాలం వెళ్ళబుచ్చాలని నా మనసు మాటగా యున్నాను. వారు ఆదరిస్తారనే నమ్మకం నాకు ఏ కోశానాలేదు."

"మరి ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలనుకుంటున్నావు?"

"నేను డిగ్రీ చదివాను మేడమ్. టైపు, షార్టు హాండ్‌లు వచ్చు. పెళ్ళికి ముందు రెండేళ్ళు ఉద్యోగం చేశాను."

"అంటే మళ్ళీ ఏదైనా ఉద్యోగంలో చేరి స్వతంత్రంగా జీవించాలనుకుంటున్నావా?"

"అవును మేడమ్."

"నువ్వీ నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులేమిటి? విడాకులు కోరడానికి చట్టంలో చెప్పిన కారణాలేవైనా నీ వద్ద ఉన్నాయా? దాపరికం లేకుండా చెప్పు. నీ ప్రాణానికి నా హామీ ఉంటుంది.

రజని ముఖంలో భయపు ఛాయలు కొంచెం తగ్గాయి.

"ఎన్నో సంబంధాలు వెతికి చివరకు ఈ కసాయి వాడికి అంటగట్టి నా గొంతుకోశాడు మా నాన్న. రెండు లక్షలు నగదు, పది తులాల బంగారం, స్కూటర్ కట్నంగా ఇచ్చారు మా వాళ్ళు. సంవత్సరం పాటు బాగానే సాగింది. తరువాత వాళ్ళ నిజ స్వరూపం బయటపడింది."

"ఏం జరిగింది?"

"అతనికి అంతకుముందే ఒక పెళ్ళయిందట. ఆ తరువాత వాళ్ళు పెట్టే కష్టాలు భరించలేక, ఆమె ఆత్మహత్య చేసుకుందట."

"ఆ విషయం ఋజువైందా?"

"లాయర్లను, పోలీసులను కొనేసి నిర్దోషిగా బయట పడ్డాడని తెలిసింది."

"అలాగా.... సంవత్సరం పాటు బాగున్న వాళ్ళు తరువాత ఎందుకు మారిపోయి ఉంటారంటావు?"

"తెలియదు మేడమ్. నా భర్త తాగుబోతు. లంచ గొండి, స్త్రీ లోలుడు. మా అత్త, ఆడపడుచు ప్రతిక్షణం సూటి పోటి మాటలంటూనే ఉంటారు. ఎదురు మాట్లాడితే చావగొట్టేవారు."

"మీ మామగారు మంచి వారేనా?"

"ఆయనకసలు నోరు లేదు. ఏదైనా మాట్లాడబోతే గుడ్లురిమేది మా అత్త. ఎవరైనా స్నేహితులు, బంధువులు, అందునా నా తరపు వారెవరైనా వస్తే నన్ను కుక్క కన్నా హీనంగా చూసేవారు. దాంతో మా వాళ్ళెవరూ రావడం మానేశారు."

"చెయ్యరాని పనులేమైనా చేయించేవారా?"

"అదీ ఇదీ అనిలేదు. తెల్లవారు జామున నాలుగు గంటలకు లేపి పాచి పనుల నుంచి పాయిఖానాలు కడిగించడం వరకూ నాతోనే. బెడ్ కాఫీలో పంచదార కొంచెం తక్కువైతే ఆ వేడి కాఫీని నా ముఖాన విసిరేస్తుంది మా ఆడపడుచు. అది చూసి నా భర్త తన చెల్లెల్ని మందలించకుండా పంచదార తక్కువ వేసినందుకు నన్ను చితక బాదేవాడు. నా సంసార జీవితంలో దెబ్బలు తినని రోజు లేదు. పెళ్ళి అన్నా, కాపురం అన్నా శరీరం వణికి పోతోంది."

"మీ సాంసారిక జీవితం?"

"వాడు కామ పిశాచి. నా శరీరాన్ని తప్ప ముఖాన్ని చూసే వాడు కాదు. పుట్టింటికి వెళ్ళి డబ్బు తెమ్మని ప్రతి రోజూ రాత్రి వేధించేవాడు. ప్రేమ, ముద్దు, ముచ్చట, ఆప్యాయత, అనురాగం అనేవి వాడి నిఘంటువులోనే లేవు."

"ఎప్పుడైనా సినిమాలు షికార్లు...."

నిర్వికారంగా నవ్వింది రజని.

"పగలు వంటింట్లో, రాత్రి పడకింట్లో జీవితం నాది. నా కోసం ఏవైనా కొనాల్సి వస్తే వాళ్ళమ్మను, చెల్లెల్ని కూడా రమ్మంటాడు. నేను మూగ బొమ్మనే."

"నీ మాటలు వింటుంటే వాళ్ళు నిన్నెంత బాధపెడుతున్నారో అర్థమౌతున్నది. శారీరక హింస చట్టరీత్యా నేరం. నేను కొన్ని అర్జెంటు పేపర్స్ చూస్తున్నాను. నాకూ 'నా' అన్న వారెవ్వరూ లేరు. నువ్వు లోపలికెళ్ళి రెస్ట్ తీసుకో. మధ్యాహ్నం లంచ్ చేస్తూ మాట్లాడుకుందాం" బెల్ కొడుతూ అన్నది భారతి.

రజని ఆశ్చర్యపోతున్నంతలో ఓ ఆడ మనిషి వచ్చింది. సైగలతోనే ఆదేశాలు జారీ చేసింది భారతి.

"అవునూ.... నువ్వీ విధంగా వచ్చినట్లు వారికి తెలుసా?" సందేహంగా అడిగింది భారతి.

"ముగ్గురూ కలిసి తన్ని తరిమేశారు. ఆ విడాకులేవో ఇప్పిస్తే మీ పాద సేవ చేస్తూ అయినా బ్రతుకుతాను." రోధిస్తూ అంది రజని.

* * *

"పెళ్ళయిన తరువాత నేను ఏనాడూ ఇంత సంతృప్తిగా భోజనం చెయ్యలేదు మేడమ్" పదార్థాలను కొంచెం కొంచెం వడ్డిస్తున్న భారతి ఆప్యాయతకు చలించిపోయి అన్నది రజని.

"నన్ను నీ సోదరిలా భావించమ్మా. ఆ భావంతోనే చెబుతున్నాను. స్త్రీ మెడలో తాళి పడాలంటే పది జతల చెప్పులు అరిగిపోవాలి. అదే తాళి తెగడానికి ఒక్కసారి జడ్జిగారి ముందు తల ఊపితే చాలు. నీకు విడాకులిప్పించడం కష్టమేం కాదు. తరువాత ఏదొక ఉద్యోగం చేసుకుంటూ బ్రతకొచ్చు. కానీ జీవితంలో అతి ముఖ్యమైన భాగాన్ని కోల్పోతావు. ఇలాంటి బాధలు చాలా మంది పడేవే. ఏమైనా సర్దుకుపోగలవేమో ఆలోచించు" అనునయంగా అన్నది భారతి.


"అంటే.... ఆ నరకంలోనే ఉండి రోజూ జీవచ్ఛవంలా పడుండమంటారా మేడమ్?"

"కాదమ్మా.... చేతికున్న అయిదువేళ్ళూ ఒకేలా ఉండవు. అందరి మనస్తత్వాలూ ఒకేలా ఉండవు. స్త్రీకి అన్ని విధాలా అనుకూలుడైన భర్త దొరకడం చాలా అరుదు. మాంగల్యానికి మూడు 'ముళ్ళు'న్నా అవి నీ పరువు ప్రతిష్టలను కంచెలా కాపలా కాస్తాయి. ఎంత దుర్మార్గుడైనా స్త్రీకి భర్త తోడు...."

"అనుభవించే వారికే ఆ నరకం అర్థమౌతుంది మేడమ్. స్త్రీ జనోద్ధరణకై అవిశ్రాంత పోరాటం చేస్తున్నారని, ఆడదాని ఆక్రందన ఎక్కడ వినిపించినా పెద్ద దిక్కులా ఆదుకుంటారని నమ్మకంతో మీ దగ్గరకొచ్చాను. కానీ మీరు నన్నిలా భయపెట్టి మళ్ళీ ఆ నరక కూపంలోకి నెట్టాలని చూస్తున్నారు" దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ అన్నది రజని.

"ఆల్‌రైట్.... ఏ లాయరైనా అడిగిందే తడవుగా విడాకు లిప్పించాలని ప్రయత్నించారు. సాధ్యమైనంత వరకు దంపతులను కలపాలనే ప్రయత్నిస్తారు. జడ్జీలు కూడా అంతే. నేనూ ఆ ప్రయత్నమే చేశాను. రేపే కోర్టులో పిటీషన్ దాఖలు చేస్తాను. అంతవరకూ నువ్వు నా దగ్గరే

**(50వ పేజీ చూడండి)**



# చిన్న గీత - పెద్దగీత

(35వ పేజీ తరువాయి)

ఉండవచ్చు." లేచింది భారతి.

* * *

రాత్రి తొమ్మిది గంటలకు భారతి బెడ్ రూమ్‌లోకెళ్ళింది రజని. భారతి బట్టలు మార్చుకుంటోంది.

"రామ్మా.... కూర్చో...." అన్నది భారతి.

బెడ్ రూమ్‌ను నిశితంగా పరిశీలించింది రజని. షోకేస్‌లో రకరకాల కొండపల్లి బొమ్మలు. మరో దాంట్లో వివిధ రూపాకృతులలో గాజు బొమ్మలు. గోడల మీద ప్రకృతి అందాలతో పెయింటింగ్స్. సీలింగ్‌కు వ్రేలాడుతున్న షాండ్లియర్స్. నేలంతా పచ్చిక పరచినట్లున్న తివాసీ చూసి పరవశించింది రజని. రతీమన్మధులు స్థిరనివాసం ఏర్పరచుకోదగ్గ ఇలాంటి వాతావరణంలో భారతి ఏకాంతంగా ఎలా జీవిస్తున్నదా అని ఆలోచించసాగింది.

ముఖానికి పౌడర్ అద్దుకుంటోంది భారతి. నలభై సంవత్సరాలు పైబడినా మెర్క్యురీ బల్బ్ కాంతులలో అప్సరసలా మెరుస్తున్నది.

డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న ఆల్బమ్‌ను తీసుకుని తిరగేయసాగింది రజని. భారతి చిన్ననాటి ఫొటోలు, కాలేజ్ డేస్‌లో, బంధుమిత్రులతో తీయించుకున్నవి చూస్తూ ఒక చోట ఠక్కున ఆగింది.

ఆ ఫొటోలో భారతి, మరో వ్యక్తి..... మెడలో నిండైన పూదండలతో....!

"మేడమ్.... ఇతను.....?" సందేహంగా అన్నది రజని.

"ఒకనాడు నా భర్త!" కూల్‌గా చెప్పింది భారతి.

"మీకు పెళ్ళయిందా?" ఆశ్చర్యంగా అడిగింది రజని.

"ఏం అలా ఆశ్చర్యపోతున్నావ్? నాకు పెళ్లి కాకూడదా?"

"కాదు లేకుంటే......"

తీక్షణంగా వీక్షించింది భారతి.

"అందరు ఆడపిల్లలాగే నేనూ పెళ్లి చేసుకున్నాను. అప్పుడు నా వయసు పదహారు. ఇంటర్ చదువుతున్నాను. లోకం తెలియని వయసు. వద్దని ఎంత మొత్తుకున్నా వినకుండా కాలేజ్ చదువులు చెప్పించడం తన వల్ల కాదని నా తండ్రి బలవంతంగా పెళ్ళి చేశాడు. ఎన్నో ఆశలతో అత్త వారింట్లో అడుగుపెట్టాను. ప్రతి స్త్రీ జీవితంలో మరచిపోలేని తొలిరాత్రి. పాల గ్లాసుతో తలనిండా మల్లెలు తురుముకుని శోభనం గదిలో అడుగు పెట్టాను. గ్లాసు ఖాళీ చేసి 'ఇప్పుడే వస్తాన'ని చెప్పి నా భర్త బయటికెళ్ళాడు. మంచం మీద తలవంచుకుని కూర్చున్నాను. తలుపు తెరుచుకున్న చప్పుడు వినిపిస్తే లేచి నిలుచున్నాను. స్పర్శ మొరటుగా అనిపిస్తే తల తిప్పి చూశాను. ఆయన మా ఆయన కాదు. వాళ్ళ నాయన! అంటే.... మా మామగారు....!"

అరికాలి కింద మందు పాతర పేలినట్లు అదిరి పడింది రజని. "వాట్.....? మరి... మీ వారు...." వణుకుతూ అడిగింది.

"వాళ్ళ నాన్నను లోపలకు పంపించి బయట తలుపు గొళ్ళెం వేసి ఎటో వెళ్ళిపోయాడు. భర్త బాహుబంధంలో గులాబీలా కరగి పోవాల్సిన నేను మామగారి ధృతరాష్ట్ర కౌగిలిలో కాగితం పువ్వులా నలిగిపోయాను. పగటి పూట కొడుకు. రాత్రి వేళ తండ్రి నాకు భర్తలైపోయారు." ఇంకిపోయిన కళ్ళతో నిస్తేజంగా అన్నది భారతి.

"మరి.... మీ.... అత్తగారు.....?" రజని స్వరంలో వణుకు తగ్గలేదు.

"వాళ్ళు ముగ్గురూ బ్రహ్మ రాక్షసులు. మా అత్తగారు ఆయనను ప్రోత్సహించేది. ఎదిరిస్తే వంటి నిండా వాతలు పెట్టేది. తమ కొడుకు నపుంసకుడని వాళ్ళకు తెలుసు. లోకం కోసం వాడికి పెళ్ళి చేశారు. వంశాన్ని నిలుపుకోవడం కోసం నన్ను చెరిచారు. తల్లిదండ్రులతో మొరపెట్టుకుని ఏడ్చాను. తమ పరువు పోతుందని, చెల్లెలి పెళ్ళి కాదని, వాళ్ళతో సర్దుకుపొమ్మని తరిమేశారు. తమ పరువు మర్యాదల కోసం అందరూ కలిసి చిగురించవలసిన పుష్పాన్ని చిదిమేశారు. ప్రాణభయంతో పారిపోయి స్థానిక మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించాను. నా కథ విని ఆయన చలించిపోయి యుక్త వయసు రాలేదని చట్టబద్ధంగా నా పెళ్ళి రద్దు చేయించారు. నన్ను దత్తత తీసుకుని చదువు చెప్పించి లాయర్ని చేశారు. నా లాంటి అభాగినులను ఆదుకొమ్మని కోరుతూ తన ఆస్తి పాస్తులన్నీ నాకు అర్పించారు. ఆ భయంకర అనుభవంతో మళ్ళీ పెళ్ళి ఊసెత్తలేదు." కళ్ళు తుడుచుకుంటూ తన గాథ వినిపించింది భారతి.

లేచి తన సూట్‌కేస్ తీసుకుంది రజని.


"మా ఇంటికి వెళ్తున్నాను మేడమ్. నన్ను దీవించండి" అన్నది.

"మరి... విడాకులు....?" ఆశ్చర్యంగా చూసింది భారతి.

"వద్దు మేడమ్.... ప్రపంచంలోని అన్ని కష్టాలూ నావేనని భ్రమ పడ్డాను. నోరు లేకపోతే స్త్రీ జీవితం ఎలా దుర్భరంగా ఉంటుందో కూడా గ్రహించాను. మీ బాధలతో పోలిస్తే నా బాధలు చాలా స్వల్పమైనవి. నా భర్తలో దుర్మార్గం ఉంది. క్రూరత్వం లేదు. మా అత్తగారికి వయసైపోయింది. పెళ్ళి చేస్తే మా ఆడపడుచు బయటకు పోతుంది. లేదా దాన్ని నాలుగు తన్ని కంట్రోల్ చెయ్యడానికి నాకు సర్వ హక్కులూ ఉన్నాయి. నేను ఎదురు తిరిగితే నా భర్త పిల్లిలా మారతాడు, కనీసం చుట్టు పక్కల వారు వింటారనైనా. ముళ్ళ బాటలో నడుస్తున్నానని చెప్పులకోసం ఏడ్చాను. కానీ ఆ చెప్పులు ధరించడానికి ఎదుటివారికి పాదాలు కూడా లేవని తెలిశాక నా బాధకు అర్థం లేదనిపించింది. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి." నిబ్బరంగా చెప్పింది రజని.

"బెస్టాఫ్ లక్....." చిరునవ్వుతో అంది భారతి.

*



## అక్కే దిక్కు

తుషార్ తుమ్మినా దగ్గినా అక్క సలహా మేరకే చేస్తానంటున్నాడు. అమ్మా నాన్నాల కంటే అక్క చాలా తెలివిగా ఆలోచించగలదు. అక్క ఓ నిర్ణయం తీసుకుంటే ఇంక దానికి తిరుగులేదు. నా కెరీర్ ప్లానింగ్ అంతా అక్కకే అప్పచెప్పాను. ఈ రోజు అక్క ఇండియాలో వున్న బిజినెస్ మాగ్నెట్స్‌లో ఒకరుగా పేరు తెచ్చుకున్నారు. అందువలన అక్కే నాకు దిక్కు అంటున్నాడు తుషార్ కపూర్.

*(ఈ భోగం ఎంతకాలం అనుకుంటున్నారు బాలీవుడ్ పండితులు)*